

దేశం గర్వించదగ్గ క్షేత్రం
దేశం గర్వించదగిన విధంగా యాదాద్రి క్షేత్రం రూపుదిద్దుకుందని సినీ దర్శకుడు, నిర్మాత గుణశేఖర్ అన్నారు. - 10లో



పరిశోధనలు చేయాలి
కాలానికి అనుగుణంగా నూతన అంశాల్లో పరిశోధనలు చేయాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
35°/19°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇళ్ల దరఖాస్తు గడువు నేటి వరకు పొడిగింపు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు గడువును ఆదివారం వరకు పొడిగించారు. ఈ మేరకు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో గడువు పెంచినట్లు పేర్కొన్నారు.

మా పోరాటానికి మద్దతివ్వండి



సాంబశివరావు, చాడ వెంకటరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను తరలించవద్దని డిమాండ్ చేస్తూ తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు శనివారం సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బస్టాండ్‌ను తరలిస్తే వందలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే పట్టణం, యాదాద్రి కొండపైన నెలకొన్న సమస్యలపైనా ఆందోళన ఉధృతం చేయనున్నామని, పార్టీ తరఫున మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు క్లెం కృష్ణ, కాటబత్తిని ఆంజనేయులు, కల్వకొలను సతీష్‌రాజ్, బబ్బూరి శ్రీధర్, బండి జంగమ్మ, బబ్బూరి పోశెట్టి పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను శనివారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, హరికిషన్ ఉన్నారు.

17 నుంచి జనచైతన్య యాత్ర



మాట్లాడుతున్న సుంకరి వీరయ్య

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తి చూపేందుకు ఈనెల 17నుంచి 29వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జనచైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకరి వీరయ్య తెలిపారు. శనివారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడమే యాత్ర లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జహంగీర్, నాయకులు నర్సింహ, అనురాధ, జగదీశ్, బాలరాజు, మల్లేశం, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం పాఠశాలల్లో ప్రచారం చేశారు. అనంతరం సంస్థాన్‌నారాయణపురంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 శాతం పీఆర్సీ ఇప్పించిన ఘనత పీఆర్‌టీయూటీఎస్‌దేనన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, రేగూరి సుధాకర్‌రెడ్డి, కిరణ్, సబిత, సూజత, రాము, హరికిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు



పాతగుట్టలో హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదగిరీశుడి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శతఘటాభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం బంగారు, వెండి కలశాలల్లో ఫలామృతాలు, సుగంధ ద్రవ్యాలు నింపి వాటితో స్వయంభూలకు, ప్రతిష్టా అలంకార మూర్తులకు అభిషేకం చేశారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నిత్యారాధనలు
ప్రధానాలయంలో సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. పాతగుట్ట ఆలయంలోనూ స్వాతి నక్షత్ర పూజలు, నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు.

• బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం భువనగిరిలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, చిత్రంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బాల్యానికి బంధం!

పసిప్రాయంలోనే పెళ్లిళ్లు
- మారుమూల ప్రాంతాల్లో అధికం
- అడ్డుకుంటున్న అధికారులు
- అయినా నిత్యం ఏదో మూలన వెలుగులోకి
- జిల్లాలో ఒక్క రోజే మూడు బాల్య వివాహాలు అడ్డగింత



సాక్షి, యాదాద్రి : అధికారులు చర్యలెన్ని చేపడుతున్నా బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడడం లేదు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నా తీరు మారడం లేదు. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక భయం వెరసి పసిప్రాయంలోనే పెళ్లి పీటలెక్కిస్తున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అధికారులు కొన్ని బాల్య వివాహాలను అడ్డుకుంటుండగా వెలుగులోకి రానివి మరెన్నో ఉంటున్నాయి. తాజాగా శనివారం ఒక్క రోజే జిల్లాలో మూడు బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.

14 ఏళ్లు నిండకముందే..
అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాత పెళ్లి చేయాలన్న నిబంధన ఉంది. కానీ, 14 ఏళ్లకే వివాహం జరిపిస్తున్నారు. ప్రధానంగా హైస్కూల్ స్థాయిలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్, విద్యా శాఖలు పనిచేస్తున్నాయి. కానీ, గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న పెళ్లిళ్లను అడ్డుకోలేకపోతున్నారు. జిల్లా జనాభాలో బాలికలు 7 శాతం ఉంటారని అధికారుల అంచనా. దీని ప్రకారం వారంతా బడిలో ఉండాలి. కానీ, పలువురు చిరుప్రాయంలోనే వివాహ చట్రంలో సమిధలవుతున్నారు. యుక్త వయస్సు రాకముందు పెళ్లిళ్లు చేస్తుండడంతో చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి.

ఈ మండలాల్లో అధికం
తుర్కపల్లి, బొమ్మలరామారం, బీబీనగర్, రాజాపేట, ఆలేరు, ఆత్మకూర్(ఎం), భువనగిరి, సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్, ఆలేరు, ఆత్మకూరం (ఎం), మోటకొండూరు మండలాల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. 9, 10వ తరగతిలోనే పెళ్లిళ్లు చేస్తున్నారు.

ప్రధాన కారణాలివీ..
పేదరికం, నిరక్షరాస్యత, ఆడపిల్లంటే తల్లిదండ్రుల్లో అభద్రత భావం, లైంగిక దాడులు, మేనరికం సంబంధాలు బాల్య వివాహాలకు ప్రధాన కారణం అవుతున్నాయి. బాల్య వివాహాలు చేయడం వల్ల భవిష్యత్‌లో కలిగే అనర్థాలపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలి. బాలికల చట్టాల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద బోర్డులపై ప్రదర్శించాలి. అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలి.

అడ్డుకుంటున్నాం
బాల్య వివాహాలను జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం పోలీస్, రెవెన్యూ, సఖీ, చైల్డ్ ప్రొటెక్షన్ టీంలు, చైల్డ్ లైన్ సహకారం తీసుకుంటున్నాం. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. బాల్య వివాహాలను అడ్డుకుని బాలికలు చదువు కొనసాగించే విధంగా కృషి చేస్తున్నాం. ఇప్పటికే పలువురు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారు. కొందరు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు.
–బండారు జయశ్రీ, సీడబ్ల్యూసీ చైర్మన్, భువనగిరి

మూడు చోట్ల అడ్డగింత
- బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్‌లో 10వ తరగతి చదువుతున్న అమ్మాయిని 23 ఏళ్ల యువకునికి ఇచ్చి వివాహం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు వెళ్లి పెళ్లిని అడ్డుకున్నారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడు, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు.
- సిద్దిపేట జిల్లా తునికిబొల్లారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక వివాహం యాదగిరిగుట్టలో జరిపించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు పెళ్లి జరగాల్సి ఉంది. కానీ, అధికారులు రాత్రి ఒంటి గంట సమయంలో రెస్క్యూ చేసి వివాహాన్ని అడ్డుకున్నారు. అదే రాత్రి అమ్మాయిని భువనగిరిలోని సఖీ కేంద్రానికి తరలించారు.
- మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలికకు పెళ్లి నిశ్చయం చేశారు. శనివారం వివాహం జరగాల్సి ఉంది. అధికారులు వెళ్లి పెళ్లిని నిలిపివేయించారు. వరుడు, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు.

జానపదుల భజన మండలికి అవకాశం కల్పించాలి

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై శ్రీస్వామివారి సన్నిధిలో నిర్వహించే భజన కార్యక్రమాల్లో జానపదుల భజన మండలికి కూడా అవకాశం కల్పించాలని అఖిల భారత హిందూ మహాసభ ప్రధాన కార్యదర్శి కమలేష్ దాస్ మహరాజ్, హిందూ మహాసభ ధర్మ ఆచార్య సంస్థ ప్రధాన కార్యదర్శి యోగి అతిదేశ్వరస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ ఆత్మరాంమహరాజ్ కోరారు. యాదగిరిగుట్టలోని గీత ఆశ్రమంలో శనివారం నిర్వహించిన జానపదుల భజన మండలి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తిరుమల తిరుపతి తరహాలో యాదాద్రి గొప్ప పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భజన కార్యక్రమాలకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఆలయ ఈఓ గీతారెడ్డికి కలిసి విన్నవించారు. సమావేశంలో జానపదుల భజన మండలి అధ్యక్షులు పి.యాదగిరి, తెలంగాణ ఇన్‌చార్జ్ చేవ్వ చిత్తరంజన్, లీగల్ ఇన్‌చార్జ్ బాలరాజు, మొగిలి చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బండి సంజయ్ ఇంటిని ముట్టడిస్తాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెంటనే ఆమెకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే బండి సంజయ్ ఇంటిని ముట్టడిస్తామన్నారు. శనివారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవితను బీజేపీలో చేరాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఒత్తిడి తెస్తుందని, లొంగకపోవడం వల్లే లిక్కర్ కేసు బనాయించి ఈడీతో విచారణ చేయిస్తుందని ఆరోపించారు. ఇది బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. దేశంలో బీజేపీ తప్ప మరో పార్టీ ఉండవద్దన్నది మోదీ ఉద్దేశం అన్నారు. అందులో భాగంగానే ప్రతిపక్ష నాయకులపై ఐటీ, ఈడీ దాడులు చేయిస్తూ కేసులు నమోదు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. 1978లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని తలపించేలా నరేంద్రమోదీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో ఆదరణ కలిగిన కవితపై అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 16 పార్టీలను ఏకం చేసి పోరాటం చేస్తున్న కవితపై అవాస్తవమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బండి సంజయ్ వెంటనే కవితకు క్షమాపణ చెప్పకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, మండల అధ్యక్షుడు పి.రమేష్, నాయకులు గోరుపల్లి సంతోష్‌రెడ్డి, దబ్బేటి రమేష్, మలిపెద్ది రాంరెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నాణ్యత లేదు

- స్వల్ప కాలానికే ధ్వంసం అయ్యాయి
- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించ లేదని, స్వల్ప కాలానికే బండలు, కిటికీలు ధ్వంసమయ్యాయని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగన్నగూడెం వద్ద 600 ఇళ్లు నిర్మిస్తామని చెప్పి 444 గృహాలు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఐదు రోజులు మాత్రమే గడువు ఇవ్వడం వల్ల చాలా మంది పేదలు దరఖాస్తు చేసుకోలేదన్నారు. వెంటనే దరఖాస్తు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయన్న ఉద్దేశంతో ప్రజలు చూడాలని డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని విమర్శించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు కాకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, దగ్గరుండి ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని స్థానిక ఎమ్మెల్యేకు సూచించారు. మున్సిపాలిటీలో 3,500 మంది అర్హులు ఉన్నారని, ప్రతి వార్డుకు 150 ఇళ్లు నిర్మించాలన్నారు. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను టెండర్లు వేయకుండానే ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని నాసిరకంగా చేపడుతున్నారని ఆరోపించారు. సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం.. ఇప్పుడు రూ.3లక్షలు ప్రకటించడం శోచనీయమన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17నుంచి విడతల వారీగా తహసీల్దార్ కార్యాలయాల నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. 20వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, పీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ, నాయకులు కె.సోమయ్య, ఎండీ మజహర్, కోట పెద్దస్వామి, చిక్కుల వెంకటేశం, బెండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

30 పడకలెప్పుడో?

ఆధునీకరణకు నోచుకోని పోచంపల్లి పీహెచ్‌సీ
- అత్యవసర వైద్యంకోసం హైదరాబాద్‌కు
- రోజూ వందకు పైగా ఓపీ
- ఆరు పడకలతోనే నెట్టుకొస్తున్న దుస్థితి



భూదాన్‌పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దశాబ్దాలు గడిచినా ఆధునీకరణకు నోచుకోవడం లేదు. పట్టణీకరణ వేగంగా జరుగుతుండడంతో అదేస్థాయిలో వైద్య సేవలు కూడా పెరుగుతున్నాయి. కానీ, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నచిన్న రోగాలకు తప్ప.. కాన్పుకు ఆపరేషన్, ఇతర అత్యవసర వైద్య సేవల కోసం చౌటుప్పల్, భువనగిరి, హైదరాబాద్‌లోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

పెరిగిన అవుట్ పేషెంట్లు
మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న భూదాన్‌పోచంపల్లి 2017లో మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపాలిటీ, మండల పరిధిలో కలిపి 51,000కు పైగా జనాభా ఉంది. ఓ వైపు జనాభా పెరుగుతున్నా ఆస్పత్రి స్థాయి మాత్రమే ఆరు పడకలుగానే ఉంది. జిల్లాలో భూదాన్‌పోచంపల్లి మినహా అన్ని మున్సిపాలిటీల్లో 30 పడకల సామర్థ్యంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇటీవల యాదగిరిగుట్టలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. చౌటుప్పల్ సీహెచ్‌సీని కూడా వంద పడకలకు పెంచారు. 50వేల పైగా జనాభా ఉన్న పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు చాలాకాలంగా కోరుతున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ సామర్థ్యం 6 పడకలు మాత్రమే ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ రోజూ సరాసరి 100 వరకు ఓపీ వస్తుండగా, సబ్ సెంటర్లలో 30 మందికి సేవలందిస్తున్నారు.

హైదరాబాద్, భువనగిరికి వెళ్లాల్సిందే..
పీహెచ్‌సీ రక్త, మూత్ర పరీక్షలు, సాధారణ కాన్పులకే పరిమితమైంది. కాన్పుకు ఆపరేషన్, రోడ్డు ప్రమాదాలు జరిగినా ఇక్కడ పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు లేవు. దాంతో రోగులు సమీపంలో ఉన్న హైదరాబాద్, లేదా చౌటుప్పల్, భువనగిరికి వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు.

అవార్డులొచ్చినా పెరగని స్థాయి
పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నందుకు గాను 2017లో రాష్ట్రస్థాయిలో కాయకల్ప అవార్డు వచ్చింది. అంతేకాక గత ఏడాది నేషనల్ క్వాలిటీ అనాలిసిస్ట్ బృందంచే జాతీయస్థాయికి ఎంపికైంది.

రోగుల సంఖ్య పెరిగింది




భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీగా మారింది. అంతేకాకుండా శరవేగంగా విస్తరిస్తోంది. అదే స్థాయిలో పీహెచ్‌సీకి రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. కానీ, ఆస్పత్రిలో చిన్నచిన్న రోగాలకే సేవలందిస్తున్నారు. ఆస్పత్రిని 30 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తే మరింత నాణ్యమైన వైద్య సేవలందుతాయి. వసతులు సమకూరుతాయి.
–కొంగరి ప్రకాశ్, భూదాన్‌పోచంపల్లి

ఎమ్మెల్యే ద్వారా కృషి



పోచంపల్లికి 30 పడకల ఆస్పత్రి అవసరం తప్పనిసరి. రెండెకరాల స్థలం కూడా అందుబాటులో ఉంది. అప్‌గ్రేడేషన్ అయితే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది. ప్రజల వైద్య అవసరాలు గణనీయంగా పెరిగాయి. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లి 30 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తాం.
–విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, భూదాన్‌పోచంపల్లి

అప్‌గ్రేడేషన్ అయితే ప్రయోజనాలు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 30 పడకల ఆస్పత్రిగా మారితే అనేక రోగాలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి.
- జనరల్ ఫిజీషియన్‌తో పాటు సర్జన్, గైనకాలజిస్ట్, అనస్తేషియా, పీడియాట్రిక్స్, డెంటల్ తదితర స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారు.
- కంటి, కుటుంబ నియంత్రణ, కాన్పు తదితర ఆపరేషన్లు ఇక్కడే జరుగుతాయి.
- ఎస్‌ఐసీయూ (న్యూ బోర్న్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఏర్పాటవుతుంది.
- రక్త, తెమడ, హిమోగ్లోబిన్, షుగర్, ఎయిడ్స్, థైరాయిడ్ తదితర అనేక రకాల పరీక్షలు అందుబాటులోకి వస్తాయి.
- పోస్ట్‌మార్టమ్ కూడా ఇక్కడే నిర్వహిస్తారు.
- వైద్య సిబ్బంది, డాక్టర్లు పెరుగుతారు.
- 24 గంటలు అంబులెన్స్ సౌకర్యం ఉంటుంది.



ఆస్పత్రిలో ఉన్న అరకొర బెడ్లు

గుట్టకు చేరిన వీఆర్‌ఏల పాదయాత్ర



వైకుంఠద్వారం వద్ద నినాదాలు చేస్తున్న వీఆర్‌ఏలు

యాదగిరిగుట్ట : రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏలు ఈ నెల 8న మునుగోడు నుంచి చేపట్టిన పాదయాత్ర శనివారం యాదగిరిగుట్టకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర చైర్మన్ ఆర్. విజయ్ మాట్లాడుతూ.. హామీలను పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది నెలల నుంచి అనేక రకాలుగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక ముగియగానే హామీలను నెరవేరుస్తామని మంత్రి కేటీఆర్, అప్పటి సీఎస్ సోమేష్‌కుమార్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, ఎన్నికలు ముగియగానే ఆ విషయాన్ని మరిచిపోయారని పేర్కొన్నారు. యాదాద్రీశుడి సన్నిధిలో పాదయాత్ర ముగిసిందని, ఆదివారం యాదగిరిగుట్టలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏలతో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు వైకుంఠద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ పాదయాత్రలో వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దాసరి వీరన్న, రాష్ట్ర కో చైర్మన్ లక్ష్మణ్ నర్సింహారావు, కన్వీనర్లు కావలి సత్యనారాయణ, నార్ల శ్రీనివాస్, ముదాం చిరంజీవి, కమిటీ సభ్యులు రత్నం భాషమోని మల్లేష్, రాజ్ కుమార్, శ్రీనివాస్, హైమద్ కిలారి, దుర్గాప్రసాద్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ఏజెంట్‌గా మోదీ ప్రభుత్వం

నల్లగొండ : కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఏజెంట్‌గా పనిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం శనివారం నల్లగొండలోని మనోరమ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని, అంబాని ప్రధాని మిత్రులని ఆరోపించారు. అదాని కుంభకోణాలపై విచారణ జరిపి బ్యాంకులకు తిరిగి డబ్బులు కట్టించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలపై పెద్ద ఎత్తున భారాలను మోపుతున్న కేంద్ర ప్రభుత్వం నీతులు వల్లిస్తోందని విమర్శించారు. ఔషధాలపై జీఎస్‌టీని తగ్గించాలని డిమాండ్ చేశారు. సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భానుకిరణ్, కార్యదర్శి రాజుభట్ మాట్లాడుతూ మందుల ధరలను తగ్గించాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, ప్రభుత్వరంగ ఫార్మా వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, విద్యాసాగర్, నాగేశ్వర్‌రావు, సునీల్, శివరాం, నిరంజన్, నరేష్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూరి గుడిసె దగ్ధం


దగ్ధమైన పూరి గుడిసె, గడ్డివాము

మర్రిగూడ: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పూరి గుడిసెతోపాటు గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని సరంపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జిడ్డు నర్సమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఆ సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వెలువడి గ్యాస్ సిలెండర్ పేలడంతో పూరి గుడిసెలోని దుస్తులు, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే ఉన్న దామెర జంగయ్యకు చెందిన గడ్డి వాము సైతం మంటలకు దగ్ధమైంది. గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఇరువురికి సుమారు రూ.80వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. కాగా సర్పంచ్ వెన్నమల్ల వెంకటమ్మమధుకర్, దామెరభీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దంపతులే నిందితులు.. !

- వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘాతుకం
- ఇద్దరు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

హాలియా : త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన నగేష్(27) హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం కారణంగానే నగేష్ దారుణ హత్యకు గురయ్యాడని తేల్చారు. ఘాతుకానికి ఒడిగట్టిన దంపతులను అరెస్టు చేశారు. హాలియా పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి మిర్యాలగూడ డీఎస్పీ పనకంటి వెంకటగిరి కేసు వివరాలు వెల్లడించారు. త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన నగేష్(27) గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన రాత్రి సతీష్ అతని తమ్ముడు ఎర్రగొర్ల నగేష్ ఇద్దరూ భోజనం చేసిన తరువాత ఒకే చోట పడుకున్నారు. అదే రోజు రాత్రి సుమారు 11 సమయంలో ఎర్రగొర్ల నగేష్ సెల్ ఫోన్‌కి ఫోన్ వచ్చింది. ఆ తరువాత ఉదయం ఎర్రగొర్ల సతీష్ చూడగా నగేష్ కనిపించలేదు. ఈనెల 6వ తేదీ నుంచి నగేష్ కనబడలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో నగేష్ సోదరుడు ఎర్రగొర్ల సతీష్ త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ నెల 7న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని..

నగేష్, కంచుగంట్ల శ్రీనివాస్ ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఒకరింటికి ఒకరు వచ్చిపోతుండేవారు. శ్రీనివాస్ లేని సమయంలో కూడా నగేష్ ఇంటికి వచ్చి వెళ్తూ అతని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. నగేష్ తన భార్యతో చనువుగా ఉంటూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని శ్రీనివాస్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో పలుమార్లు నగేష్‌ని హెచ్చరించినా తీరు మార్చు కోలేదు. నగేష్‌తో స్నేహంగా ఉంటూనే అతనిపై శ్రీనివాస్ కక్ష పెంచుకున్నాడు. అదును చూసి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

భార్యతో నగేష్‌కి ఫోన్ చేయించి..

పథకం ప్రకారం ఈనెల 5వ తేదీ రాత్రి శ్రీనివాస్ తన భార్య మీనాక్షితో నగేష్‌కి ఫోన్ చేయించి తన ఇంటికి వచ్చేవిధంగా పథకం పన్నాడు. అదే రోజు రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన నగేష్‌ను శ్రీనివాస్ కత్తితో మెడపై నరికాడు. నగేష్‌కి బలమైన గాయాలు అయి మంచంపై పడిపోగా శ్రీనివాస్ భార్య మీనాక్షి ఇంట్లో ఉన్న కర్రతో నగేష్ తనపై బలంగా మోదింది. దీంతో మరో మారు కత్తితో శ్రీనివాస్ నగేష్‌ని పొడిచాడు. అతని ప్రాణం ఇంకా పోలేదని భావించిన శ్రీనివాస్, అతని భార్య మీనాక్షి ఇద్దరూ కలిసి నైలాను తాడుతో నరేష్ మెడకు రెండు సార్లు చుట్టి హత్య చేశారు. అనంతరం పశువుల కొట్టం వద్ద ఉన్న సెప్టిక్ ట్యాంక్ మూత పగలగొట్టి నగేష్ మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో పడవేశారు. దీంతో పాటు నగేష్ చెప్పులు, సెల్‌ఫోన్‌తో పాటు రక్త మరకలు అంటిన తమ దుస్తులను సెప్టిక్ ట్యాంకులో వేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని తన ఇంట్లోని వడ్ల బస్తాల వెనుక దాచిపెట్టినట్లు పోలీసులు సమక్షంలో కంచుగంట్ల శ్రీనివాస్, భార్య మీనాక్షి ఒప్పుకున్నాడు.

అనుమానంతో అదుపులోకి తీసుకుని..

ఇటీవల నగేష్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో భాగంగా కంచిగట్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తన భార్యతో కలిసి నగేష్‌ను హత్య చేసి తన ఇంట్లో ఉన్న సెప్టిక్ ట్యాంకులో మృతదేహాన్ని పడవేసినట్లు నేరం అంగీకరించాడు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకుని కేసులో నిందితులైన శ్రీనివాస్‌తో పాటు అతని భార్య కంచిగట్ల మీనాక్షిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటగిరి వివరించారు. కేసును ఛేదించిన హాలియా సీఐ గాంధీనాయక్, త్రిపురారం ఎస్‌ఐ శోభన్‌బాబు, సిబ్బంది రవి, శ్రావన్‌కుమార్, శ్రీనివాస్, రాము, శ్రీనును అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో హాలియా ఎస్‌ఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- ఇంటింటికీ తిరుగుతూ కిలో బియ్యానికి రూ.10వరకు చెల్లించి కొనుగోలు
- సేకరించిన బియ్యాన్ని నల్లగొండ, భువనగిరిలో విక్రయం

మునుగోడు: పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వ్యాపారులు ఆ బియ్యంతో ప్రతి నెలా రూ.లక్షలు గడిస్తున్నారు. మండలంలోని కొందరు రైస్‌మిల్లు వ్యాపారులు కొంత మంది చిరు వ్యాపారులని ప్రోత్సహిస్తూ ఇంటింటికీ పంపి కిలో రూ. 7 నుంచి రూ.10 వరకు చెల్లించి కార్డుదారుల నుంచి కొనుగోలు చేయిస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాని తమ మిల్లులో నిల్వ చేసుకొని వాటిని సేకరించిన వారికి కిలోకు రూ. 3 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిసింది. అలా సేకరించిన బియ్యం 50 క్వింటాళ్ల వరకు పోగు కాగానే రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఓ వాహనంలో లోడు చేసుకొని చిట్యాల, భువనగిరి, నల్లగొండ పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇలా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న సమయంలో ఎవరైన అధికారులు లేదా పోలీసులు పట్టుకుంటే వెంటనే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు రంగప్రవేశం చేసి వ్యాపారులకు మద్దతుగా నిలుస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి నెలా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


రమేష్‌కు బంగారు ఆభరణాలను అందజేస్తున్న డ్రైవర్ వెంకటాద్రి

నల్లగొండ రూరల్ : బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన బంగారు ఆభరణాలను తిరిగి అప్పగించి ఓ ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి నల్లగొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్ శుక్రవారం హైదరాబాద్ నుంచి రూ.3లక్షల విలువైన బంగారు ఆభరణాలతో ఆర్టీసీ బస్సులో నల్లగొండకు వచ్చాడు. బస్సు దిగేముందు బంగారు ఆభరణాలను మర్చిపోయాడు. డ్రైవర్ వెంకటాద్రి నిజాయితీగా బంగారు ఆభరణాలను భద్రపరిచి రాత్రి ప్రయాణికుడు రమేష్‌కు అందజేశాడు. డ్రైవర్ వెంకటాద్రిని ఆర్టీసీ అధికారులు అభినందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం


సతీష్ మృతదేహం


వెంకటయ్య (ఫైల్)

నేరేడుచర్ల : వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. నేరేడుచర్ల, నేరెడుగొమ్ము మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన మేడే సతీష్(28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఏ పని చేయలేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య మల్లేశ్వరీ, ఇద్దరు కుమారులున్నారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకుని మరొకరు..

చందంపేట : కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన వంపు వెంకటయ్య (35) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వెంకటయ్య నెల రోజులుగా గ్రామం నుంచి అదృశ్యం కావడంతో కొండమల్లేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదిలా ఉంటే నేరెడుగొమ్ము మండల కేంద్రంలో ఉంటున్న వరుసకు మేనత్త ఇంటికి వచ్చిన వెంకటయ్య తన ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పుకొని తాను బతకలేనని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంకటయ్యను తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ కొన్ని నెలల క్రితం నేరెడుగొమ్ముకు వచ్చిన వెంకటయ్య మండల కేంద్రంలోని చెరువు వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా శనివారం అటుగా వెళ్తున్న స్థానికులు చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు పాల్పడి చాలా రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.



వివాహిత ఆత్మహత్యాయత్నం

వేములపల్లి: సాగర్ ఎడమకాల్వలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శనివారం సాయంత్రం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన గాదె రమ్య కుటుంబ కలహాలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో భర్త నాగరాజుతో గొడవపడి శెట్టిపాలెం గ్రామ శివారులోని సాగర్ ఎడమకాల్వ వద్దకు చేరుకుని కాల్వలోకి దూకింది. గమనించిన స్థానికులు వెంటనే కాల్వలోకి దూకి రమ్యను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రమ్య చేతికి అయిన గాయాన్ని గుర్తించి మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం రమ్యకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

వలిగొండ : గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటన వలిగొండ మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములకొండకు చెందిన శాగంటి మంగమ్మ వ్యవసాయ బావి వద్ద పనిచేసుకుంటున్న క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు ఆమె దగ్గరకు వెళ్లారు. గడ్డి దొరుకుతుందా, కొంటామని వివరాలు అడుగుతున్నట్లు చేసి ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మేళ్లచెరువు : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండలకేంద్రం శివారులోని చౌటపల్లి రోడ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన సీహెచ్.రమేష్ తన భార్య కుమారుడుతో కలిసి బైక్‌పై చౌటపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మేళ్లచెరువు శివారులో చౌటపల్లి వైపు నుంచి వస్తున్న టిప్పరు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రమేష్ కాలు రెండు చోట్ల విరిగినట్లు అతని భార్యకు కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ.సురేష్ యాదవ్ తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్


నిందితులను చూపుతున్న పోలీసులు

భువనగిరి : చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన దుర్గ ప్రసాద్, షేక్ ఆరీఫ్, పల్లాపు కళ్యాణ్ గత ఫిబ్రవరి 12వ తేదీన పట్టణ శివారులో ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో హుండీ తాళం పగలగొట్టి దొంగతానికి పాల్పడ్డారు. ఆలయ ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా భువనగిరి రూరల్ పోలీసులు, సీసీఎస్ సహకారంతో దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సూర్యాపేట క్రైం : ప్రమాదవశాత్తు సద్దుల చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర లింగయ్య (25) బ్యాండ్ వాయిద్యకారుడు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో యర్కారం గ్రామానికి చెందిన వివాహానికి బ్యాండ్ వాయించేందుకు వచ్చారు. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న చెరువులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయాడు. సమీప జాలర్లు గుర్తించి మృతదేహాన్ని వెలికితీశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

కోదాడరూరల్ : కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ వద్ద గల ఎన్ఎస్పీ కాల్వలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీనగర్ శివారులో కాల్వలో కొట్టుకవస్తున్న మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 వరకు ఉంటుందని, చామనఛాయ రంగులో ఉన్నాడని తెలిపారు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతిచెంది ఉంటాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

గోదావరి జలాల పెంపు

అర్వపల్లి: జిల్లాకు గోదావరి జలాలను శనివారం పెంచారు. 1,200 క్యూసెక్కుల గోదావరి జలాలు వస్తుండగా 1.800 క్యూసెక్కులకు పెంచినట్లు నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం పెంచిన వాటిలో 69 డీబీఎంకు 600 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 100 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 1,100 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


పూజల్లో పాల్గొన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు

భువనగిరి : మండలంలోని నమాద్‌పల్లి గ్రామంలో గల శ్రీపూర్ణగిరి దేవాలయం ఆవరణలో శనివారం శ్రీసుదర్శన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంచర్ల రామకృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇంతకుముందు ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. వీరి వెంట ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, జనగాం పాండు, నాయకులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్‌కు స్వాగతం

రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బాధ్యత స్వీకరించిన తరువాత మొదటిసారిగా భువనగిరికి వచ్చిన సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. వారిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ అమరేందర్, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు ఉన్నారు.

కార్మికుల రక్షణకు ఏప్రిల్‌లో రథయాత్ర

భానుపురి(సూర్యాపేట): కార్మికులకు రక్షణ, ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో రథయాత్ర నిర్వహించనున్నట్లు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు యరగాని నాగన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశంలోని 10 కార్మిక సంఘాలు కలిసి దశలవారీగా ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని, ఈ విషయాన్ని గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులకు రథయాత్ర ద్వారా వివరిస్తామన్నారు. సమావేశంలో రెబల్ శ్రీను, మాణిక్యం, శ్రీనివాస్, రాము, రవీందర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

- ఎమ్మెల్యే గాదరి కిషోర్

సూర్యాపేట: ఎమ్మెల్సీ, ఉద్యమకారురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ మహిళా సమాజాన్ని కించపరిస్తే మహిళలు బండి సంజయ్‌ని బట్టలూడదీసి కొడతారన్నారు. మహిళలను కించ పరిచే బండి సంజయ్ నోరు ఫినాయిల్‌తో కడగాలన్నారు. మహిళలను గౌరవించలేని దౌర్భాగ్యపు అధ్యక్షుడున్న పార్టీ బీజేపీ అని విమర్శించారు. ఈడీ ఏం చేసేది బీజేపీ నేతలకు ముందే ఎలా తెలుస్తుందన్నారు. బీజేపీ చేస్తున్న అన్యాయాలను ఎదురిస్తే కేసులు పెడతారా, ఎన్ని కేసులు పెట్టినా ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన తాము బయపడేది లేదన్నారు. బీజేపీతో ఏదైనా తేల్చుకోవడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు.. సమగ్ర సస్యరక్షణ

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు సూచనలు



నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాల్లో మూడు వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట సాగు చేపట్టారు. ఈ పంటను ఆహారంగానే కాకుండా దాణా రూపంలో, పశువులకు మేత, వివిధ పరిశ్రమలలో ముడి సరుకుగా, పేలాల, తీపి కంటె, బేబీకార్న్‌గాను ఉపయోగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించి అపార నష్టం కలుగజేస్తుంది. కత్తెర పురుగు తొలిదశ నుండే ఆశించడం వలన సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో నష్టం ఎక్కువయ్యే అవకాశం ఉంది. అవసరాన్ని బట్టి తగిన చర్యలు చేపట్టాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు చెబుతున్నారు.


నడిగూడెం సమీపాన సాగులో ఉన్న మొక్కజొన్న పంట

పురుగు లక్షణాలు : కత్తెర పురుగు తన జీవిత చక్రాన్ని 34 నుంచి 36 రోజుల్లో పూర్తి చేసుకుంటుంది. తొలిదశ లార్వాలు లేత ఆకుపచ్చ శరీరంతో, నల్లని తల కలిగి ఉంటాయి. ఎదిగిన లార్వాలు ముదురు గోధుమ రంగులో ఉండి తలపైతెల్లని తల కిందులుగా ఉన్న ఇంగ్లీషు వై ఆకారపు గుర్తు కలిగి ఉంటుంది. ఎదిగిన లార్వాలపై నల్లని చుక్కల వరుసలుంటాయి. లార్వాతోక వైపు నల్లని 4 చుక్కలు చతురస్రాకారంలో ఉంటాయి.

సస్యరక్షణ చర్యలు : ఒక ప్రాంతంలోని మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులందరూ కలిసి సామూహిక సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం బాగుంటుంది. పంట విత్తిన వెంటనే ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు, పైరు 30 రోజుల దశ వరకు ఎకరానికి 10-15 బుట్టలు పైరుకన్నా ఒక అడుగు ఎత్తులో పెట్టాలి. పురుగు ఉనికికి, ఉధృతిని బట్టి తగిన చర్యలు చేపట్టాలి. పొలాన్ని విత్తే ముందు లోతైన దుక్కి చేయాలి. దీంతో నిద్రావస్థలో ఉన్న కత్తెర పురుగు ప్యూపాలు పక్షుల బారిన పడి లేదా ఎంట తాకి డికి చనిపోతాయి. ఒక ఊరిలోని రైతులు మొక్కజొన్నను విడతలుగా కాకుండా వారం రోజుల వ్యవధిలో విత్తుకోవాలి. సయాంట్రనిలిప్రోల్ 19.8 శాతం మరియు థయోమిథాక్సామ్ 19.8 శాతం మందును 6 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తాలి. మొక్కజొన్నను కందిలో అంతరపంటగా 2:1 లేదా, 4:1 నిష్పత్తిలో సాగు చేయాలి. మొక్కజొన్న పంట చుట్టూ నేపియర్ పశుగ్రాసాన్ని ఆకర్షిత పంటగా వేసి, నేపియర్ గడ్డి మొక్కల మీద కత్తెర పురుగు సముదాయాలు కనిపించిన వెంటనే వేప నూనె 15000 పిపిఎం 5.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నోమోరియాలియో లేదా మెటారైజియం ఎనైనోప్లిరెఖె జీవ శిలీంద్రాలను 5 గ్రాములు లీటరు నీటికి కలిపి సాయంత్రం పూట పిచికారీ చేయాలి. 31-65 రోజులలోపు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనిటోరమ్ 0.5 మి.లీ లేదా ఇండాక్సాకార్బ్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కత్తెర పురుగు నష్టపరిచే విధానం

మొదటి దశ లార్వాలు పత్ర హరితాన్ని గీకి తినడం వలన ఆకులపై తెల్లటి పొరలు ఏర్పడతాయి. ఆకుని తొలుచుకొని తిని, తర్వాత సుడిలోకి ప్రవేశిస్తాయి. రెండు మూడు దశల్లో లార్వాలు ఆకుల సుడిలో ఉండి రంధ్రాలు చేస్తూ తింటాయి. దీని వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడతాయి. సుడిలో ఆకులను పూర్తిగా కత్తిరించి తింటాయి. ఒక్కోసారి ఆకు ఈనెలు మాత్రమే మిగులుతాయి. కంకి ఏర్పడే దశలో ఆశిస్తే కంకి పొరలను తొలుచుకుంటూ లోపలి గింజలను తింటాయి.